# బాచి మామయ్య బలేవాడే!

**"అ**రే! నేన్రా బుచ్చిని, వైజాగ్ నుంచి, ఎలా ఉన్నావు! ఏమిటి మన బాచి మామయ్య చాలా బెంగగా ఉన్నాడని విన్నాను, ఎందుకని?

"ఇటువంటి విషయాలు ఫోన్లో ఏం చెపుతాను చెప్పు. ఒకసారి వీలు చూసుకుని హైదరాబాద్ రా. అన్ని విషయాలు మాట్లాడుకుందాం, సరేనా! మేం బాగానే ఉన్నాం" అన్నాడు బుచ్చి సోదరుడు విష్ణు.

"అలాగే! నాకు ఆఫీసు పని కూడా ఉంది. వచ్చేవారం అంతా హైదరాబాద్‌లో ఉంటాను. ఏమో ఎలా అయినా, నాకు మామయ్య విషయం అదుర్దాగానే ఉంది!" అన్నాడు బుచ్చి.

"మంచిది ఉంటా!" అని ఫోన్ పెట్టేశాడు విష్ణు.

బుచ్చి, విష్ణూ అన్నదమ్ములు. వీరికి వాళ్ల బాచి మేనమామంటే చాలా ఇష్టం. వీళ్ల మామయ్య పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పెద్ద ఆఫీసర్‌గా పనిచేసి రెండు సంవత్సరాల క్రితమే రిటైరయ్యాడు. ఈయన పేరు భాస్కర వర్మ. ముద్దుపేరు బాచి. ఈయనంటే డిపార్ట్‌మెంట్‌లో పెద్ద పేరు. చాలా నిక్కచ్చయిన మనిషి. ఏదైనా తేడా వస్తే పేరుకి తగ్గట్లు వేసంకాలం సూర్యునిలా చండప్రచండమైపోయే వాడు. ఎప్పుడు చాలా ఉత్సాహంగా ఉండేవాడు.

బుచ్చి హైదరాబాద్ వచ్చి విష్ణుని ఆ రోజు సాయంకాలమే, ఒక గార్డెన్ రెస్టారెంట్‌కి తీసుకువెళ్లి మామయ్య గురించి వివరాలడిగాడు.

విష్ణు మొదలుపెట్టాడు, "నే చెప్పే విషయాలు మరెక్కడా అనకు! నాకు చాలా రోజుల వరకూ, మామయ్య ఎందుకు బాధపడుతున్నాడో తెలీలేదు. నేనంటే తనకి చాలా ఇష్టం కదా, మొన్న ఒకరోజు ఫోన్ చేసి నన్ను ట్యాంక్‌బండ్ దగ్గరికి రమ్మని చాలా విషయాలు చెప్పాడు. మన బాచి మాయ్య రిటైర్‌మెంట్ విషయం తెలీని మన అత్తయ్య స్నేహితురాలు, అమెరికా నుంచి వచ్చి 'ఈరోజు అన్నయ్యగారు సెలవుపెట్టారా! ఇంట్లోనే ఉన్నారు' అందిట. అత్తయ్య 'ఇక ఆయనకి అన్నీ సెలవులే రిటైరైపోయారు' అందిట. 'అయ్యో ఎప్పుడూ!' అందిట ఆవిడ ఈ విషయం చెప్పి,

మామయ్య "ఎవ్వరో పోయినట్లు అయ్యో! ఎప్పుడూ' అని అడిగిందిరా. చాలా బాధపడ్డాను నేను" అన్నాడు.

"పైగా పుట్టిన ప్రతీవాడూ కాలం చేసినట్లు, ఉద్యోగం చేసిన తర్వాత రిటైర్‌మెంట్ తప్పదు కదరా విష్ణూ!" అని నన్నడిగాడు.

"అరే దీనికెందుకురా మామయ్య అంత బాధపడడం" అన్నాడు బుచ్చి.

"ఇదే కాదురా. ఇంకా చాలా విషయాలు చెప్పి బాధపడ్డాడు. మామయ్య

ఉద్యోగంలో వున్నప్పుడు ఇంట్లో పనివాళ్లు అన్ని పన్లు చేసేవారు. రిటైరయిన తర్వాత ఇంట్లో పనిచేసేవాళ్లు కరువయ్యారు. పొద్దునే ఆ ఇంట్లో ఉండే కుక్కని బయట తిప్పుకురమ్మంటోందిట అత్తయ్య. పైగా అస్తమానూ 'ఆ కుక్క మీరూ వెళ్లి రండి, ఆ కుక్కా మీరు స్నానం చెయ్యండి' అంటూ పని పురమాయిస్తే మామయ్యని పనివాడిలా చూస్తున్నారని బాధపడుతున్నాడు. ఆయన ఉద్యోగంలో ఉన్నన్నాళ్లూ ఈ కుక్కల విషయాలు ఇంట్లోనూ ఆఫీసులోనూ కూడా ఆయన కింద పనిచేసే వారు చూసుకునే వారు కదా అని బాధపడ్డాడు మామయ్య.

"అది సరేరా ఆ గెడ్డం ఎందుకు పెంచినట్లు" అన్నాడు బుచ్చి.

"ఏం లేదురా! ఈ కుక్కని బయట తిప్పేటప్పుడు తనకింద పనిచేసిన వాళ్లెవరైనా గుర్తుపడితే తట్టుకోలేక!"

"ఏమిటో రా నిజంగా రాజవైభవం అనుభవించిన మామయ్యని ఇలా చూడలేకపోతున్నాం. వైకుంఠపాళీలో పెద్దపాము మింగినట్లు ఉందిరా నా జీవితం అని బాధపడ్డాడు రా!" అన్నాడు విష్ణు.

"అయినా, అత్తయ్య కూడా మామయ్య మనస్సుని బట్టి నడుచుకోవాలి కదురా! ఆయన చాలా సెన్సిటివ్ అని అందరికీ తెలుసుకదురా!" అన్నాడు బుచ్చి.

"ఆ కుక్కని తీసుకుని మోర్నింగ్ వాక్‌కి వెళ్లేటప్పుడు 'బయట ఏం తినకండి! ఆ కుక్కకి మీకూ ఏదో ఒకటి నేనే పెడతాను. లక్షణంగా ఇంట్లో కూర్చుని తిందురుగానీ!' అంటుందిట అత్తయ్య. ఆ 'కూర్చుని తిందురుగాని' అన్న మాటలు సహించలేకపోతున్నా' అని తెగ బాధపడ్డాదురా మామయ్య. పైగా 'ఇంత కష్టపడి ముప్పై ఆరు సంవత్సరాలు పనిచేసినందుకు గవర్నమెంటు పెన్షన్ ఇస్తూంటే నేను ఏం ఖర్చు చేసుకోడానికి లేదురా! బయట టిఫిన్ తినడానికి కూడా లేదు!' అని

చాలా దీనంగా చెప్పాడు. బుచ్చీ! ఈ విషయాలు మాత్రం ఎక్కడా అనకు చిన్నప్పట్నుంచీ నేనంటే చాలా ఇష్టం మామయ్యకి.

పైగా ఆయన పోలికే కదా నేను. అందుకని నేనంటే ప్రేమతో ఈ విషయాలు నాకు మాత్రం చెప్పాడు, పాపం''

''నేనెందుకు చెపుతాన్రా! ఇంకా ఏమన్నాడు మామయ్య?''

''ఏముందిరా! మామయ్య ఉద్యోగంలో ఉన్నన్నాళ్లూ, ఎవరైనా మామయ్య గురించి ఇంటికి వస్తే, అత్తయ్య హాల్లో నుంచి లోపలిగదిలోకి వెళ్లేదట! ఇప్పుడు అత్తయ్య గురించి ఇరుగుపొరుగు ఆడవాళ్లు వస్తే, అత్తయ్య మామయ్యకేసి చూస్తుందట! వెంటనే మామయ్య తనచేతిలో ఉన్న పేపరు, పుస్తకంతో సహా వెనుక గదిలోకి వెళ్లి ఆ వచ్చిన వాళ్లు వెళ్లిన తర్వాత మళ్ళీ హాల్లోకి వస్తున్నాడట''.

''అబ్బ! వినడానికే కష్టంగా ఉందిరా విష్ణు! ఇన్ని బాధలొకసారి చుట్టుముట్టేస్తే ఎవరైనా కృంగిపోతారు!'' అన్నాడు బుచ్చి.

''అరే నీకుజ్ఞాపకం ఉందో లేదో మామయ్య బూట్లు చప్పుడు అల్లంత దూరంలో విని, ఆ మూలా ఈ మూలా నక్కేవారు మన చుట్టాల్లో కొంతమంది. వాళ్లు మామయ్య రిటైర్‌మెంట్ తర్వాత, 'ఏరా బాచీ బాగున్నావా!' అని అడుగుతున్నారట. ఇలా చెపుతూ పోతే, చాలా విషయాలున్నాయి'' అన్నాడు విష్ణు.

''రేప్పొద్దున్న ఒక్కసారి మామయ్యని చూద్దాంరా'' అన్నాడు బుచ్చి.

ఆ మర్నాడు సోదరులిద్దరూ వెళ్లేసరికి మామయ్య ఇంట్లో లేడు. అత్తయ్య అంది '' ఆ కుక్కా ఆయనా కలిసి బయటికి వెళ్లారు వచ్చేవేళయింది కూర్చోండి'' అని.

ఇంతలో మామయ్య రానే వచ్చాడు. ''ఏరా భుజంగరావ్ వైజాగ్ నుంచి ఎప్పుడు వచ్చావు'' అన్నాడు బుచ్చిని చూసి.

''అదేమిటి మామయ్యా! బుచ్చి అని పిల్చేవాడవు పూర్తి పేరు పెట్టి పిలుస్తున్నావ్! కొంచెం ఎబ్బెట్టుగా ఉంది!'' అన్నాడు బుచ్చి.

''ఏంలేదురా! ఎబ్బెట్లు అలవాటు చేసుకో! రిటైర్ అయిన తరువాత కష్టంగా ఉండదు. మొన్నెవడో వైజాగ్ వచ్చి, నేను రిటైర్ అయిన తరువాత, మీ అత్తయ్య 'క' అంటే 'క', 'కీ' అంటే 'కీ' అంటున్నానని చెప్పేడుట నిజమేనా!'' అన్నాడు మామయ్య.

ఇంతలో అత్తయ్య వచ్చి బుచ్చిగాడ్ని రక్షించింది. "ఏమిటండీ మీరు మరీను! అతను చాలా రోజుల తర్వాత మనింటికి వస్తే పోలీస్ ఎంక్వయిరీలు" అంటూ, కాఫీ కప్పు చేతికిచ్చింది.

"సరే! సరే! ఏది ఏమైనా మీరు మాత్రం మేనరికాలు చేసుకోకండి! నాకు ఎలాగూ ఆడపిల్లలు లేరనుకో, పెద్ద మామయ్య, చిన్నమామయ్య బహూశా వాళ్ల పిల్లల్ని ఇస్తామని వస్తారేమోనని చెపుతున్నాను". "మేనత్త కొడుకూ ఒక మొగుడేనా అని సామెత" అన్నాడు, మామయ్య.

వెంటనే అత్తయ్య కళ్లల్లో నీళ్లు తిరిగాయి. "నేనేదైనా తప్పు చేస్తే సూటిగా చెప్పండి! మనది మేనరికమని ఎత్తిపొడుపు మాటలు మాట్లాడితే చాలా బాధపడతాను. అయినా పెళ్లయిన తరువాత నేనెప్పుడైనా బావా అని కూడా పిలవలేదు. ఎప్పుడూ మీరు మీరు అనే అన్నాను. నేనేదో మిమ్మల్ని మేనబావ కదా అని, చులకన చేశాననుకుంటారు ఈ పిల్లలు. ఇంట్లో ఉన్న ఈ కుక్కని కూడా ప్రేమతో, ఒక కుటుంబ సభ్యురాలిగా చూసే నేను మిమ్మల్ని ఎందుకు అగౌరపరుస్తాను"

మామయ్య అవాక్కయిపోయాడు. "టేక్ ఇట్ ఈజీ" అంటూ "సాయంకాలం మీ అత్తయ్యతో సినిమాకి వెడదాం అరే విష్ణు మంచి సినిమాకి టిక్కెట్స్ తీసుకో!"

బయటికి వచ్చిన తర్వాత బుచ్చి అన్నాడు "మామయ్య ప్రతీదీ భూతద్దంలో చూస్తున్నాడేమోరా! పెళ్లయిన తరువాత పాపం అత్తయ్య 'బావా'! అని కూడా పిలవలేదట. అటువంటావిడ అప్పర్ హ్యాండ్ ఎందుకు తీసుకుంటుందిరా!".

"అదే నాకు అర్థం కాలేదు. ఈ రాత్రి వెండితెరపై 'శుభం' అని చూద్దాం"! అన్నాడు విష్ణు. సినిమా ఆఖరుదాకా ఆగక్కర్లేకుండానే అంతా శుభంగా కనిపించింది. భాస్కర్‌గారు గెడ్డంతీసేసి నున్నగోరింకలా ట్రిమ్‌గా తయారై, ఆయన మిసెస్ చెయ్యి పట్టుకుని సినిమాకి వచ్చాడు.

ఆయన్ని చూసిన మేనల్లుళ్లు "బాచి మామయ్య బలేవాడే" అనుకున్నారు.

(ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక 2-11-2006)